# తనదాకా వస్తేనే...



**బా**ల్కనీలో కుర్చుని న్యూస్ పేపర్ చదువుకుంటున్నాడు ప్రకాశరావు.

అతని భార్య నిర్మల ఇల్లంతా ఊడ్చి చెత్తని ప్లాస్టిక్ బుట్టలో వేసి, బాల్కనీ దగ్గరికి వచ్చి అక్కడినుంచి ఆ చెత్తని వీధిలోకి పడేసింది. గాలికి కొన్ని కాగితాలు తిరిగి బాల్కనీలోకి వచ్చాయి. మిగిలిన చెత్త, దుమ్ము రోడ్మీద పడింది.

"కొంచెం కిందికి వెళ్లి చెత్తకుండీలో ఆ చెత్త వేస్తే బాగుంటుందిగా!" అన్నాడు ప్రకాశరావు.

"ఆ... మెట్లుదిగి ఎవరు పోతారు?... రోడ్డు మీదకి విసిరేస్తే పోయేదానికి!" అంది నిర్మల.

"ఎవరి నెత్తినైనా పడితేనో?!" అన్నాడు ప్రకాశరావు.

"ఎందుకు పడ్తుంది? ఏమీ పడదు. అయినా... అందరూ చేసే పనేగా ఇది?" అంటూ ఇంట్లోకి వెళ్లిపోయింది భార్యామణి.

ఇంక ఆమెతో మాట్లాడి లాభం లేదని ఊరుకున్నాడు ప్రకాశరావు.

నాలుగు రోజులు గడిచింది.

ఆరోజు ప్రొద్దున్నే ఆరున్నర కావస్తూంది.

ఇల్లంతా దేనికోసమో వెతుకుతోంది నిర్మల.

ప్రకాశరావు ముఖం కడుక్కోబోతూ– "ఏమిటి వెతుకున్నావు?" అన్నాడు.

"చంటివాని వెండి ఉగ్గుగిన్నె కనిపించడం లేదండీ! ఉగ్గుపెట్టి ప్రొద్దున్నే అలమార్లోనే ఉంచాను" అంది నిర్మల ఆందోళనగా.

"ఎక్కడికిపోతుంది? ఇంట్లోనే ఎక్కడో ఉండి ఉంటుంది" అంటూ బాత్‌రూంలోకి వెళ్లిపోయాడు ప్రకాశారవు.

"అమ్మా... పొద్దున్న చెల్లాయి దానిని పట్టుకుని పాకుతూ సావిట్లో తిరుగుతుంటే ఇందాక చూశాను. ఒకవేళ చీకటి చాటున నువ్వు దానిని కూడా ఊడ్చి అవతల పారేశావో, ఏమో..!" అంది కూతురు కమల.

"కిందకెలా వచ్చిందబ్బా! చీకటిచాటున సరిగ్గా పెట్టకపోతే కిందపడిపోయిందో, ఏమో! అవునేవ్... నువ్వు చెప్పినట్లు ఊడ్చేసి ఉంటాను. ఇందాక ఊడుస్తుంటే ఏదో ఘల్లుమంది కూడాను. ఏ ఇనుప ముక్కో అయ్యుంటుందనుకున్నాను. నేను కిందకి పోయి చూసి వస్తాను కాని, నువ్వు వంటిల్లు కొంచెం శుభ్రం చేయి" అంటూ కిందకి పరుగెత్తింది నిర్మల.

కమల వంటింట్లోకి వెళ్లి క్రితం సాయంత్రం తరిగిన కూర పెచ్చులు, మిగిలిపోయిన కాఫీ డికాక్షన్ పొడరూ, ఎంగిలి కంచాల్లో మిగిలిన మెతుకులూ... అన్నీ కలిపి గిన్నెలోకి ఎత్తి బాల్కనీలోంచి వీధిలోకి విసిరేసి తిరిగివచ్చింది.

మరునిముషంలో నిర్మల పైకి పరుగెత్తుకుంటూ వచ్చింది– ఒళ్లంతా కాఫీ డికాక్షన్ మరకలూ, నెత్తి మీద కూర చెక్కలూ, ఎంగిలి మెతుకులతో.

కోపంగా ఉరిమి చూస్తూ–

"ఏమిటే... నువ్వు చేసిన పని?" అంటూ గర్జించింది.

"కిందకి చూడకుండా విసిరానమ్మా... నీ మీద పడినట్లుంది!" అంది కమల భయం భయంగా.

అప్పుడే బాత్‌రూంలోనుంచి వస్తున్న ప్రకాశంకి ఆ దృశ్యం చూసేసరికి నవ్వు ఆగలేదు.

"అందుకే వీధిలోకి చెత్త విసరకూడదంటాను. ఇది నీకయింది కాబట్టి సరిపోయింది. అదే ఇంకెవరికైనా అయితే ఎంత గొడవయ్యేది?" అన్నాడు.

నిర్మల ఏమీ మాట్లాడలేకపోయింది.

"అమ్మా... ఉగ్గుగిన్నె వంటింటి మోరీలో దొరికింది" అంది కమల దానిని చూపిస్తూ.

"బాత్‌రూంలోకి బట్టలు తీసుకొని రావే!" అంటూ స్నానం చేయడానికి వెళ్లిపోయింది నిర్మల.

– జయశ్రీ ప్రత్యేక సంచిక... జనవరి '87

## అదీ సంగతి..!

చలాకీరావు చింతపండు పెట్టి తోమిన గున్నటి కంచుచెంబు వంటి, వేయి వాట్ల బల్బ్‌లాగా మెరిసిపోతున్న బట్టతలతో మంగలి షాపులోకి అడుగుపెట్టాడు.



మంగలి ఆయన క్షవరం చేస్తుండగా- "ఏమయ్యా... నీతిది న్యాయమేనా? నాక్కూడా నువ్వు అందరితోపాటు హెయిర్ కటింగ్‌కి ఇరవై రూపాయలు తీసుకోవడం బాగా ఉందా? అసలు నా నెత్తి మీద కత్తిరించడానికి జుట్టేమి ఉంది చెప్పు?" అన్నాడు తన తెలివికి మురిసిపోతూ.

"నిజమే బాబుగారూ... కాని, నేను మీకు క్షవరం చేయడానికి తీసుకుంటుంది ఐదు రూపాయలే! మిగిలిన పదిహేను రూపాయలు మీ తలమీద వెంట్రుకలు ఎక్కడున్నాయో వెతకడానికి!" అన్నాడు మంగలి వస్తున్న నవ్వుని ఆపుకుంటూ.

చలాకీరావు తల సడన్‌గా ఫ్యూజ్‌ఆఫ్ బల్బ్‌లాగా వెలవెలపోయింది.